బీజేపీతోనే దేశంలో సుపరిపాలన : ఈటల



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్‌రూరల్: బీజేపీ బాజాప్తా (పక్కా) రాజకీయ పార్టీ అని జంగమయ్యల పార్టీ కాదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా పూడూర్ గ్రామంలో మంగళవారం జిల్లాస్థాయి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన పలువురికి పార్టీ సభ్యత్వాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారతదేశం బీజేపీ పరిపాలనలోనే సురక్షితంగా, సుభిక్షంగా ఉంటుందని దేశ ప్రజానీకం భావిస్తుందన్నారు. రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధ సమయంలో తమ దేశంలో శాంతి నెలకొనాలంటే రెండు దేశాల మధ్య యుద్ధం ఆపగలిగే శక్తి దేశ ప్రధాని మోదీకే ఉందని, రెండు దేశాల ప్రధానులు చెప్పారన్నారు. నెహ్రూ తర్వాత మూడోసారి ప్రధానిగా కొనసాగుతున్న వ్యక్తి మోదీ అన్నారు.

మేడ్చల్ నియోజకవర్గం సంపూర్ణ మద్దతు..

గత పార్లమెంట్ ఎన్నికల్లో మేడ్చల్ నియోజకవర్గ ప్రజలు, నేను నివాసం ఉంటున్న పూడూరు గ్రామం, శామీర్‌పేట్ నాకు సంపూర్ణంగా మద్దతుగా నిలిచాయని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వ నమోదు సైతం రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా జరగాలని సూచించారు. బీజేపీ పెట్టుకున్న 50 లక్షల సభ్యత్వాలు నమోదు కావాలంటే నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి సభ్యత్వం చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్, మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు విక్రమ్‌రెడ్డి, నాయకులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, చంద్రశేఖర్‌యాదవ్, నందారెడ్డి, శైలజ, మోహన్‌రెడ్డి, మల్లికార్జున్‌ముదిరాజ్, నర్సింహ్మారెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీ సభ్యత్వాన్ని అందజేస్తూ..

‘దిశ’ చూపితేనే ప్రయోజనం

- దిశ లేక కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై జరగని సమీక్ష
- మూడు నెలలైనా ఏర్పాటు కాని కొత్త కమిటీ



సాక్షి,సిటీబ్యూరో: కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలపై పర్యవేక్షణతో పాటు వాటి అమలు, నిధుల వినియోగంపై సమీక్షించాల్సిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశ నిర్వహణపై సందిగ్ధం నెలకొంది. ఈ కమిటీకి స్థానిక ఎంపీ అధ్యక్షత వహిస్తుండగా... కలెక్టర్ మెంబర్ సెక్రటరీగా వ్యవహరిస్తారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా దిశ కమిటీ మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలో విస్తరించి ఉంది. దీంతో ఈ కమిటీకి ఎంపీ ఈటల రాజేందర్ చైర్మన్, కలెక్టర్ గౌతమ్ మెంబర్ కార్యదర్శిగా వ్యవహరిస్తారు.

◆ ప్రతి మూడునెలలకోసారి జరగాల్సిన దిశ సమావేశాలను గతంలో మల్కాజిగిరి ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన నేతలు రెండు, మూడు పర్యాయాలు మినహాయించి ఎక్కువగా నిర్వహించలేకపోయారని తెలుస్తోంది. తాజాగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ బాధ్యతలు చేపట్టి 3 నెలలు గడవడంతో కొత్త కమిటీ సమావేశం ఎప్పుడనే విషయంపై చర్చ జరుగుతోంది. ఈ కమిటీలో స్థానిక ఎంపీ, కలెక్టర్‌తో పాటూ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, పురపాలిక చైర్మన్లు, జెడ్పీ చైర్మన్లు, ఎంపీపీలు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు (డీఆర్డీఓ)లతో పలువురు నామినేటెడ్ సభ్యులుంటారు. పాత కమిటీ రద్దు కావటంతో కొత్త కమిటీ ఏర్పాటుకు ఇప్పటికే కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే దిశ కొత్త కమిటీ ఏర్పాటు ప్రక్రియ పూర్తికానున్నట్లు సంబంధిత శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. జిల్లా, మండల పరిషత్‌ల పాలకవర్గాల పదవీ కాలం ముగిసిపోవటంతో ప్రస్తుతం ఏర్పాటు కానున్న కొత్త కమిటీలో వాటి ప్రాతినిధ్యం ఉండదు.

త్వరలో కొత్త కమిటీ..

పాత కమిటీ రద్దు కావటంతో కొత్తగా దిశ కమిటీ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఈ నేపథ్యంలోనే త్వరలో కొత్త కమిటీ ఏర్పాటు కోసం సమావేశం జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోనున్నారు.

చర్చ జరిగితేనే ప్రయోజనం..

ఎంపీ ల్యాడ్స్‌తో పాటు కేంద్రప్రభుత్వ పథకాలైన ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, పీఎం ఫసల్ బీమా యోజన, ముద్రా రుణాలు, పీఎం ఆవాస్ యోజన తదితర పథకాల అమలుపై నిర్మాణాత్మకచర్చ జరిగితేనే దిశ కమిటీ సమావేశాలు ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుంది. గత పదేళ్లుగా నిర్మాణాత్మక చర్చ జరగకపోవడంతో అర్హులైన వారికి చాలా వరకు కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనం చేకూరలేదు. ఈ ఏడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించడంతో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులకు పరిహారం అందే వీలుంటోంది. దిశ సమావేశంలో ఇలాంటి సమస్యలను చర్చిస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉండనుంది.

లెక్చరర్లను నియమించాలని..

ఆందోళన చేపట్టిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు



ధర్నా చేస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

మేడ్చల్: మేడ్చల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ కళాశాల ఆవరణలో విద్యార్థులు ఎస్ఎఫ్ఐ నేతలతో కలిసి ధర్నా నిర్వహించారు. కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు బదిలీలు జరిగి మూడు నెలల గడుస్తున్నా.. ఇంతవరకు కొత్తవారిని నియమించలేదన్నారు. పరీక్షలు దగ్గరు పడుతున్నా అధ్యాపకులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మేడ్చల్ కళాశాలలో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు సంతోష్ రాథోడ్, కిరణ్, సుమన్, బాబు, శ్రీకాంత్, రమేష్, అరవింద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



కీసర: గీతాంజలి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం తిమ్మాయిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్టేషనరీ, నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ఆర్. ఓడయ్య, అసోషియేట్ ప్రొఫెసర్, కో– ఆర్డినేటర్లు డాక్టర్ ఏ. రమేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిఏటా ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన



మేడ్చల్: ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ కళాకారులు మేడ్చల్ బస్టాండ్‌లో పూడూర్ గ్రామంలో కళాజాత కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో వైఆర్‌జీ కేర్ సంస్థ లింక్ వర్కర్స్ స్కీమ్ ప్రాజెక్ట్ ద్వారా కళాకారులు తమ ఆటపాటలతో ప్రజలకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ప్రాజెక్ట్ జిల్లా కో– ఆర్డినేటర్ రామిరెడ్డి, కళాకారులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి



మల్లారెడ్డితో మాజీ సీఎం కేసీఆర్

మేడ్చల్: మాజీ సీఎం కేసీఆర్‌ను మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మల్లారెడ్డి పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులతో కేసీఆర్ నివాసానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా మల్లారెడ్డిని శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

అప్పు తీర్చాలని వేధించిన వ్యక్తికి జైలు

మేడ్చల్: అప్పు తీర్చాలని ఒత్తిడి చేయడంతో ఓ వ్యక్తి మృతికి కారణమైన నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. మేడ్చల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణమూర్తి తెలిపిన ప్రకారం.. సూరారంకు చెందిన విజయ్‌కుమార్ తన మిత్రుడు వెంకటేశ్‌కు 2012లో రూ. 3 లక్షలు జమానతుగా ఉండి వడ్డీకి అప్పు ఇప్పించాడు. ఆర్థిక పరిస్థితి బాగోలేక అప్పు తీర్చలేకపోయాడు. దీంతో వెంకటేష్‌ను విజయ్‌కుమార్ మానసికంగా వేధించడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. బాధితుడి కుటుంబసభ్యులు సూరారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. వాదనలు విన్న న్యాయమూర్తి అజయ్‌కుమార్‌జాదవ్ నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 500 జరిమానా విధించారు.

వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళి

వీరనారి చాకలి ఐలమ్మ మహిళా శక్తి, బహుజన ధీరత్వానికి ప్రతీక అని పలువురు నేతలు కొనియాడారు. మంగళవారం ఐలమ్మ వర్ధంతి సందర్భంగా రజక సంఘం, వివిధ సంఘాలు, పలు పార్టీల నాయకులు ఆమె విగ్రహం, చిత్రపటానికి ఘనంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు.

– మేడ్చల్ జోన్ బృందం



కీసరలో..



నివాళులర్పిస్తున్న రజకసంఘం నాయకులు



జవహర్‌నగర్‌లో శ్రీకాంత్‌యాదవ్, ఇన్‌స్పెక్టర్ నాగరాజు



మేడ్చల్‌లో నివాళులర్పిస్తున్న నేతలు

దుమ్మాయిగూడలో హైడ్రా అధికారుల పర్యటన

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని నాసిమ్ చెరువును హైడ్రా అధికారులు సందర్శించారు. మంగళవారం దమ్మాయిగూడ నాసిమ్‌చెరువు పూర్తి విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి సర్వే చేపట్టారు. చెరువు బఫర్‌జోన్ పరిధిలో నిర్మించిన అక్రమ నిర్మాణలను హైడ్రా అధికారులు గుర్తించడంతో పాటు కొత్తగా నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. లేక్‌వ్యూకాలనీ, వీఆర్ఆర్ కాలనీ, పీఎస్‌రావ్‌నగర్ ఫేస్–2 కాలనీ, వేంకటేశ్వరనగర్ కాలనీల్లో కొన్ని ఇళ్లు చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో నిర్మించినట్లు హైడ్రా అధికారులు గుర్తించారు. ప్రస్తుతం చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్ పరిధిలో నిర్మాణాలను చేపడుతున్న వారు ఆందోళన చెందుతున్నారు.



నిర్మాణాలను పరిశీలిస్తున్న హైడ్రా, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

జవహర్‌నగర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జవహర్‌నగర్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల ఆధ్వర్యంలో ఆటపాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మేనేజర్ నగేష్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీదేవి, శ్రీధర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ పద్మజ , ఏసీపీ మహేష్



మేడ్చల్ పెద్ద చెరువు వద్ద కలెక్టర్ గౌతమ్

కీసర: వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మల్కాజిగిరి డీసీపీ పద్మజ అన్నారు. మంగళవారం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని నాసిమ్ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. మున్సిపల్ సిబ్బంది, స్థానిక పోలీస్ అధికారులకు జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణితాశ్రీకాంత్‌గౌడ్, ఏసీపీ మహేష్, సీఐ నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, నేతలు మోర నరహరిరెడ్డి, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ చెరువుల వద్ద కలెక్టర్..

మేడ్చల్: జిల్లాలో వినాయక నిమజ్జనం కోసం చెరువుల వద్ద పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన శామీర్‌పేట్ పెద్ద చెరువు, మేడ్చల్ పెద్ద చెరువు, సుతారిగూడ చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. అన్ని వినాయక విగ్రహాలను ఒక చెరువులో నిమజ్జనం చేయకుండా సమీప చెరువుల్లో నిమజ్జనం చేసేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి అపశ్రుతులు దొర్లకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఏసీపీలు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు నాగిరెడ్డి, స్వామి, మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికానర్సింహ్మారెడ్డి, ఇరిగేషన్ ఈఈ సునీత, ఎంపీడీఓలు మమతబాయి, వసంతలక్ష్మి, డీఈ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన స్థానిక నేతలు



మేడ్చల్: పీసీసీ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మహేష్‌కుమార్‌గౌడ్‌ను మేడ్చల్‌కు చెందిన కాంగ్రెస్ నేతలు కలిశారు. మేడ్చల్ నుంచి ఆయన నివాసానికి వెళ్లి ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు శంకర్, సంతోష్‌గౌడ్ తదితరులున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



మేడ్చల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల్లో 11 మందిని ఎంపిక చేసి మండల స్థాయిలో సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏంఈఓ వసంతకుమారి ఉపాధ్యాయులను సత్కరించి అభినందించారు.

ఆలయంలో చోరీ

శామీర్‌పేట్: లక్ష్మాపూర్ ఎల్లమ్మ ఆలయంలో చోరీ జరిగిన ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మూడుచింతలపల్లి మండలం, లక్ష్మాపూర్ గ్రామంలోని ఎల్లమ్మ తల్లి దేవాలయంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ప్రధాన ద్వారాల తాళాలు పగలగొట్టి ఆలయంలోకి చొరబడి అమ్మవారి బంగారు ముక్కుపుడకతో పాటు కిలో వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. క్లూస్ టీం ఘటనా స్థలంలో ఆధారాలను సేకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

అప్పుల బాధతో వ్యక్తి అదృశ్యం..



నాగరాజు (ఫైల్)

శామీర్‌పేట్: అప్పులబాధతో వ్యక్తి అదృశ్యమైన ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులో వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నాగరాజు (43), భార్య రేణుక, కుటుంబంతో ఏడేళ్ల క్రితం మండల కేంద్రమైన మూడుచింతలపల్లికి వలస వచ్చి నివాసం ఉంటున్నారు. కాగా రూ. 6 లక్షలు అప్పుచేసి ఇటీవల మూడుచింతలపల్లిలో నాగరాజు వెల్డింగ్‌షాప్‌ను ప్రారంభించారు. అప్పుల విషయంలో భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆగస్టు 24న ఉదయం 9 గంటల సమయంలో ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కాగా భార్య మంగళవారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

గౌతంనగర్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్ అన్నారు. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని జ్యోతినగర్‌లో కొనసాగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ నవీన్, నాయకులు మేకల రాముయాదవ్, జ్యోతినగర్ కాలనీ అధ్యక్షులు మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

నియామకం



గొంగళ్ల రాజారమేష్

పోచారం: తెలంగాణ ఓబీసీ గొర్ల కాపర్ల సెల్ స్టేట్ కో– ఆర్డినేటర్‌గా గొంగళ్ల రాజారమేష్ కురుమ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. తనకు ఇచ్చిన పదవీబాధ్యతలను బాధ్యతతో నిర్వర్తిస్తామని స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, పోచారం మున్సిపల్ అధ్యక్షుడు నానావత్ సురేష్‌నాయక్ తదితరుల నాయకత్వంలో క్రియాశీలకంగా పనిచేస్తానని చెప్పారు.

మట్టి గణపతి నిమజ్జనం

కీసర: పర్యావరణ పరిరక్షణలో భాగంగా దమ్మాయిగూడ మున్సిపల్ చీర్యాలలోని ఎస్ఎల్ఎన్ హోమ్స్‌లో గణేష్ ఉత్సవాల్లో భాగంగా కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మట్టి గణనాథుడికి మూడు రోజుల పాటు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి నిమజ్జనం చేశారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషిచేయాలనే ఉద్దేశంతో ఈ మట్టి గణపతిని కాలనీలో ఏర్పాటు చేశామన్నారు.



కొనసాగుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 17 వ వార్డు సత్యనారాయణ కాలనీ వెల్ఫేర్ అసోషియేషన్ కమిటీ హాల్‌లో గణపతి మండపంలో మంగళవారం గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు. ఎస్సీకాలనీలోని గణేష్ మండపం వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజలకు మున్సిపల్ చైర్మన్ హాజరయ్యారు . మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, బీజేపీ నేత కౌకుట్ల రాహుల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సోమన్న, భూమిక పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యలయం వద్ద ప్రతిష్ఠించిన వినాయక మండల వద్ద డాక్యుమెంట్ రైటర్లు అన్నదానం చేశారు. అలాగే పలు మండపాల వద్ద మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య ప్రత్యేక పూజలు చేశారు.



నాగారం ఎస్సీకాలనీలో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి



సత్యనారాయణ కాలనీలో కుంకుమార్చనలో..



ఘట్‌కేసర్‌లో చైర్‌పర్సన్ పావనీజంగయ్య



ఘట్‌కేసర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద..